క్లుప్తంగా

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు


అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలని వేదిక్పై అధిష్టంపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు .అనంతరం 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సమరభేరికి మద్దతుగా సంతకాల సేకరణ


దేశపాత్రునిపాలెంలో సంతకాలు సేకరిస్తున్న సీపీఎం కార్యకర్తలు

పరవాడ: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యలపై సీపీఎం సమరభేరి నిర్వహిస్తుందని ఆ పార్టీ నాయకురాలు పి.మాణిక్యం అన్నారు. సమరభేరికి మద్దతుగా ఆదివారం దేశపాత్రుని పాలెంలో ప్రజల నుంచి సంతకాల సేకరించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అధిక భారాలు మోపాయన్నారు. రూ. 450 ఉన్న వంట గ్యాస్‌ను రూ.1150 పెంచి మళ్లీ ఇప్పుడు రూ.200 తగ్గించడం కంటే మరో మోసం ఉండదన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.డి.నాయుడు, వెంకటలక్ష్మి, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సింహాచలం: పెందుర్తి మండలం కోట్నివానిపాలెంలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న 14 మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.50 లక్షల నగదు 12 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 14 మందిపై పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏయూ అభివృద్ధి విధానం హర్షణీయం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సాంకేతికంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో చదువుకున్న 1984–86 బ్యాచ్ పీజీ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఈ బ్యాచ్ విద్యార్థులు విభాగాన్ని సందర్శించి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ క్యాంపస్‌లో జరుగుతున్న నూతన ప్రాజెక్టు లు, కార్యక్రమాలను తాము ఎప్పటికప్పుడు ప్రసారమాధ్యమాలు, స్నేహితుల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తుకు అవసరమైన నూతన సాంకేతికతలను చేరువ చేసి నేటి తరం విద్యార్థులకు అందిస్తున్న విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించాలని వీసీ పూర్వ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా శాకాహార సద్భావన ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం: బ్రహ్మర్షి పితామహ పత్రీజీ దివ్య ఆశీస్సులతో పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. గాజువాక దిబ్బవానిపాలెం కాలనీలో శ్రీ పరమాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు బి.అప్పారావు నేతృత్వంలో జెండా ఊపి ఘనంగా ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రేవతి దేవి, శివగణేశ్వరరావు, జయలక్ష్మి, సొసైటీ మాస్టర్ వర్మ రాజు, లక్ష్మణరావు, పద్మావతి, బాలాజీ, రామారావు, సుబుధి, అప్పలరాజు, సురేష్, దేవిక, కృష్ణ, జంగమయ్య, లక్ష్మి, పవన సుధ, చినఅప్పారావు, కనకారావు, విష్ణుకుమార్ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు చకచకా

- ప్రారంభోత్సవానికి ముస్తాబు
- మౌలిక వసతుల కల్పనలో అధికారుల నిమగ్నం


కాలనీలో ఏర్పాటు చేస్తున్న ముఖద్వారం


పరవాడలో జగనన్న గృహ సముదాయం

పరవాడ: జగనన్న కాలనీలు సందడిగా మారాయి. త్వరలో గృహప్రవేశాలకు ముస్తాబవుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. అధికారులు కాలనీవాసులకు అవసరమైన మౌలిక వసతులు కలిప్తున్నారు. దీనిలో భాగంగా రోడ్లు,తాగునీటి, విద్యుత్ సదుపాయాలు కల్పించారు. కాలనీ ప్రారంభంలో ఆర్చి నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నారు. దీంతో పరవాడ జగనన్న కాలనీలో సందడి వాతావరణం కనిపిస్తోంది. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి దివాన్‌మైదిన్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, రహదారులు, కాలువల నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. పనులు వేగవంతం అయ్యేలా అవసరమైన సూచనలు అందిస్తున్నారు.

పరవాడ జగనన్న లేఅవుట్–1లో...

పరవాడ జగనన్న లేఅవుట్–1లో ప్రభుత్వం 289 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్లు మంజూరు చేసింది. ప్రస్తుతం 173 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వాటి నిర్మాణాలు పూర్తి చేయడానికి వీలుగా లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా అందించాల్సిన మెటీరియల్‌ను గృహ నిర్మాణ శాఖ అధికారులు సరఫరా చేస్తున్నారు. కాలనీలో రెండు బోర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ సదుపాయం సమకూర్చారు. త్వరలో జగనన్న కాలనీలను సీఎం ప్రారంభం చేయనున్న నేపథ్యంలో పరవాడ లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి కాలనీని ముస్తాబు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.31 లక్షలతో కాలనీలో ముఖద్వారం(ఆర్చి), రోడ్లు, కాలువల నిర్మాణ పనులు చకచకా పూర్తి చేస్తున్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



పరవాడ జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులతో రోడ్లు, డ్రైనేజీ, ఆర్చి నిర్మాణ పనులు వేగవంతం చేశాం. కాలనీలో మెయిన్ రోడ్డుతో కలిపి 15 వీధి రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తున్నాం. పనులను నిర్ణీత సమయానికి పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం.
– ఎం.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ

గ్లకోమా ప్రమాదకర వ్యాధి


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జీఆర్‌రెడ్డి

సింహాచలం: గ్లకోమా అనేది కంటి దృష్టిని నిశ్శబ్దంగా హరించే ప్రమాదకరమైన వ్యాధి అని ఏపీ ఆప్తాల్మిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ రెడ్డి తెలిపారు. విశాఖ ఆప్తాల్మిక్ అసోసియేషన్– గ్లకోమా సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గ్లకోమా ఇండియా ఎడ్యుకేషన్ ప్రోగ్రాం సదస్సు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రెడ్డి మాట్లాడుతూ కంటిలో ఏమాత్రం అనారోగ్యం సోకినా వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ కంటిలో అధిక పీడనం ఏర్పడడం వల్ల గ్లకోమా వ్యాధి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి విజయకుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, చెన్నైలోని ప్రీమియర్ ఐ కేర్ సర్జికల్ సెంటర్ డాక్టర్ ఎస్ఆర్ రంగరాజ్, ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ మల్లీశ్వరి,డాక్టర్ కేవీవీ సత్యనారాయణ, డాక్టర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ వీక్


సమావేశంలో పాల్గొన్న వాసవీ క్లబ్ అల్లిపురం ప్రతినిధులు

అల్లిపురం : వాసవీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా జయంతి సందర్భంగా వాసవీ క్లబ్ అల్లిపురం ఆధ్వర్యంలో వాసవీ వీక్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అల్లిపురం శాఖ అధ్యక్షుడు డీఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ మేరకు అల్లిపురం సౌత్ జైలురోడ్డులో గల క్లబ్ ఆవరణలో ఆదివారం సభ్యులు సమావేశమయ్యారు. వారం రోజుల కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు 1వ తేదీన దాతలకు సన్మానం, రెండవ రోజు మాతృవందనం కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను పూజించడం, మూడవరోజు వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు అల్పాహారం అందించడం జరిగాయన్నారు. ఇక నాల్గవ రోజు విద్యార్థులకు మోటివేషన్ కోచింగ్, ఐదవ రోజు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్లకు సత్కారం, ఆరవ రోజు పాత్రికేయ దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు సత్కారం, 7వ రోజు ప్రత్యేక తరగతి విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం చేపట్టేందుకు తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్లబ్ కార్యదర్శి బీవీఎల్ కుమార్, కోశాధికారి పీవీఎస్ఆర్ గుప్తా, రీజనల్ చైర్‌పర్సన్ వరిగల పండు, ప్రోగ్రాం చైర్మన్ వంకాయల విక్రమ్, ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, బోర్డు సభ్యులు పెన్నం రత్నాజీరావు, డీవీఆర్ గుప్తా, ఎం.భద్రం, కేఆర్ నాగేశ్వరరావు, వంకాయల రవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహార కిట్ల పంపిణీ


కిట్ల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ వరలక్ష్మి, లుపిన్ ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు మంత్రిపాలెంలో లుపిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహార కిట్లు అందజేశారు. జాతీయ పోషకార వారోత్సవాల సందర్భంగా లుపిన్ ఫార్మా కంపెనీ సీఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, లుపిన్ హెచ్ఆర్ డీజీఎం ఎస్.శ్రీనివాసరావులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వరలక్ష్మి మాట్లాడుతూ పోషకాహారం, ఆరోగ్యకరమైన అలవాట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల్లో సంపూర్ణ ఆరోగ్యం కోసం తమ సంస్థ సహకారం అందిస్తోందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారీ, లుపిన్ వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు, లంకెలపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ దివ్యలత తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వృత్తి విద్యలో శిక్షణ


ఉపాధి శిక్షణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మహిళలు

పెదగంట్యాడ: మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు ఇటువంటి శిక్షణలు దోహదపడతాయని ఎంవీఆర్ గ్రూప్ ఆఫ్ స్మాల్ స్కేల్ యూనిట్స్ ప్రతినిధి మొల్లేటి వెంకటరావు అన్నారు. 65వ వార్డు వాంబే కాలనీలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్థాంతరంగా చదువులు వదిలేసి, వంటింటికే పరిమితమైన మహిళలు ఇటువంటి శిక్షణ తీసుకుని తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలో 25 రకాల వృత్తి విద్యా కోర్సులను నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొల్లపల్లి రాంబాబు, ప్రసన్న కుమార్, లోకనాథం, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, కసిరెడ్డి సత్యనారాయణ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి


ఫోర్త్ టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా జీవించాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కొత్త సీఐగా బాధ్యతలు స్వీకరించి వారం రోజులు కావడంతో ప్రతి ఒక్క రౌడీషీటర్‌ను ఆయన విచారించి, పలు వివరాలు, వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఏఎస్ఐ డి.వి.రత్నం కౌన్సెలింగ్ నిర్వహించారు. గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల దినచర్యపై ఆరా తీశారు. హద్దు మీరి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకుని, ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 934వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులతోపాటు ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ఉక్కు పరిశ్రమను అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం మరీ ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారని, కేంద్రం చేస్తున్న ప్రకటనలను విరమించుకుంటే బాగుంటుందన్నారు. పోరాటం చేయడం రాష్ట్ర ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కేంద్రం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగాల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం



ర్యాలీగా వస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార : నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగ కల్పనకు ఐక్యంగా ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో సరస్వతీ పార్కు నుంచి డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా లలితా జ్యూయలరీ వరకు నిరుద్యోగ యువతీ, యువకులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు యూఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గనాయుడు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలకు ఎసర పెడున్నారని మండిపడ్డారు. సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలున్నప్పటికీ పర్మినెంట్ ఉద్యోగాలు తీయకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ వంటి ఉద్యోగాలు ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులకు లాభాలు చేకూరుస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు యువత ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.సంతోష్, ఐద్వా రాష్ట్ర నాయకులు బి.పద్మ, డాక్టర్ జి.ప్రియాంక, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యు.రాజు, ఎల్.జి. నాయుడు, గణేష్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రక్కు డ్రైవర్ల సంక్షేమానికి పెద్ద పీట వేయాలి


ట్రక్కు డ్రైవర్లను సత్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్

మద్దిలపాలెం : ప్రజా రవాణతో పాటు నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే ట్రక్కుల డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ కోరారు. జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలోని శ్రీవేంకటేశ్వర మినీ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల సంఘం సభ్యులు ఆదివారం ఏఐటీయూసీలో చేరారు. వారికి గోవింద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లను ఇబ్బంది పెట్టే జీవో నంబర్ 31ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధురెడ్డి, సత్యనారాయణ, సాయి, రాజు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక


నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వేడుకగా జరిగింది.

పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇకపై ఏటా ఒకసారి కలుసుకోవాలని పూర్వవిద్యార్థులంతా నిర్ణయించుకున్నారు. తమ బ్యాచ్‌లో ఎవరికి ఆపద వచ్చినా ఆర్థికంగా ఆదుకోవాలని వారంతా తీర్మానించారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి కార్యక్రమాన్ని ముగించారు.

మద్యం మత్తులో తూలిపడి వ్యక్తి మృతి


మద్యం మత్తులో రాళ్లపై పడి మృతి చెందిన రమేష్ పరిచా

పరవాడ: చినతాడి గ్రామంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మద్యం మత్తులో కింద పడి మృతి చెందాడు. అతుడు ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా భార్గన్ ప్రాంతానికి చెందిన రమేష్ పరిచా(46)గా గుర్తించారు. చినతాడి గ్రామంలో స్నేహితులతో నివాసం ఉంటున్నాడు. ఫార్మాసిటీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్లుగా పరిచా మద్యానికి బానిసై ఊగుతూ జోగుతూ ఉంటున్నాడు. స్నేహితులను కూడా పట్టించుకోవడం మానేశాడు. ఇదే క్రమంలో శనివారం ఉదయం తన తోటి స్నేహితులు కంపెనీలో విధులకు వెళ్లిపోయారు. పరిచా మాత్రం ఉదయం నుంచి తాగుతూ రాత్రి నివాసం ఉంటున్న ప్రదేశంలో అరుగుపై నిద్రపోయాడు. అరుగుపై నుంచి కింద నున్న రాళ్లపై పడడం వల్ల తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం నిద్ర లేచిన స్నేహితులు పరిచా మృతి చెందినట్లు గుర్తించి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మల్లేశ్వరరావు చెప్పారు.

పెన్షనర్లకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు


పెన్షనర్లకు దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేష్

సబ్బవరం: సబ్బవరం యూనిట్ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశమందిరంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు.అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీఆర్ పట్నాయక్, బుద్ద నర్సింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇందూస్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ గుల్లేపల్లి వెంకటేష్ దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్న సమస్య అని అలసత్వం వహిస్తే సమస్య పెద్దదిగా మారి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని వివరించారు. అనంతరం దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందుగా నిర్వహించిన సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్లే స్లిప్స్, ఈకేవైసీ, లైఫ్ సర్టిఫికెట్ వంటి పలు రకాల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో బి. క్రాంతిదాస్, సంఘం కన్వీనర్ కె. దేముడు,ఎస్. రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత


మాట్లాడుతున్న సీఐ భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: రహదారి భద్రత.. అందరి బాధ్యతని, రోడ్డు ప్రమాదాలకు గురయ్యే కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకునేలా ప్రతీ ఒక్కరిలో అవగాహన పెంచుకోవాలని గాజువాక సీఐ లంకా భాస్కరావు అన్నారు. ఉత్తరాంధ్ర ట్రక్ ఓనర్స్ అండ్ సప్లయర్స్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గాజువాక శ్రీనగర్‌లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ ప్రమాదాలను అరికట్టడం ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాదని, దీనిపై ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, ఎం.జానకీరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని గాజువాకలో ట్రక్ టెర్మినల్ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనేక పరిశ్రమలు, వాణిజ్య సంస్థలతో ముడిపడి ఉన్న గాజువాకలో భారీ వాహనాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. ప్రమాదాల నియంత్రణకు తమ వంతు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ట్రక్ టెర్మినల్ ప్రతిపాదనను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ భాస్కరరావును జ్ఞాపికతో ట్రాన్స్ పోర్టు ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, అరవింద్ కుమార్ మిశ్రా, మిట్టల్ అగర్వాల్, పి.జె.ఆర్.ఎస్.మహారధి తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక నిత్య హితోక్తులు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు, సాహితీవేత్తలు

సీతంపేట: తెలుగు భాషకు గౌరవం, ఆదరణ పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కళావేదిక వ్యవస్థాపకుడు, డాక్టర్ నందూరి రామకృష్ణ రచించిన 'సామాజిక నిత్య హితోక్తులు 2' అనే పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగు భాషకు, సాహిత్యానికి ఆదరణ, గౌరవం తగ్గిందని, ప్రభుత్వాలకే కాదు యువతలోనూ లోపించిందన్నారు. తెలుగు భాష దండగ అనే భావన పిల్లల్లోనే కాదు, తల్లిదండ్రుల్లోనూ ఎక్కువగా కనిపిస్తోందని చెప్పారు. ఇంగ్లిష్ నేర్చుకుంటే ఉపయోగం అన్న భావన ప్రస్తుత తరంలో బాగా పెరిగిందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన సూచనగా ప్రతి ఒక్కరూ పరిగణించాలన్నారు. ఇలాగే కొనసాగితే వందేళ్లలో తెలుగు భాష పూర్తిగా ప్రమాదంలో పడుతుందన్నారు. తెలుగు భాషను కాపాడుదాం అన్న ఆలోచనతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సాహితీవేత్తలు, సంఘాలు పెద్ద ఎత్తున పూనుకోవాలని పిలుపునిచ్చారు. తొలి ప్రతిని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు ఎ.హెచ్.ఎస్.వెంకటరావుకు అందజేశారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని పుస్తకాన్ని సమీక్షించారు.